: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 7 | 22-11-2021 | పుటలు : 4






# నన్నయ నాక్ సాధనకు కృషి

ఏ దేశమైనా అభివృద్ధి చెందడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల ఉన్నత విద్య యొక్క పరిమాణం (పెరిగిన యాక్సెస్) మరియు నాణ్యత (అందించే అకడమిక్ ప్రోగ్రామ్‌ల ఔచిత్యం మరియు శ్రేష్ఠత) ఎంతో ప్రధానమైనది. విశ్వవిద్యాలయాలు ఉన్నత ప్రమాణాలును పాటిస్తూ నాణ్యమైన విద్య, పరిశోధన, ప్రాజెక్టులు, విద్యార్థుల ప్రగతి, వనరులు, వసతులు మరియు పాలన, నిర్వహణ వంటి అన్ని అంశాలను అంచనా వేస్తూ విశ్వవిద్యాలయ ప్రమాణాల స్థాయి ఆధారంగా నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (NAAC) గుర్తింపునిస్తుంది. NAAC అక్రిడిటేషన్ విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీ సభ్యులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

విశ్వ విద్యాలయాల స్థాయిని పెంచుతూ నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే ఆలోచనతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు 2022వ సంవత్సరం చివరి నాటికి నాక్ గుర్తింపు ఉండాలని సూచించింది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపును తీసుకురావాలనే దృఢ సంకల్పంతో ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు సంకల్పించారు. వారి నాయకత్వంలో విశ్వవిద్యాలయ స్థాయి నాక్ కమిటీని నియమించి నాక్ సాధనకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసారు. నాక్ గుర్తింపుకు అవసరమైన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ISO) గుర్తింపును సాధించారు. అలాగే యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (AICTE) సర్టిఫికేషన్ ను సాధించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయం స్వీయ అంచనా నివేదిక తయారు చేయడంలో నిమగ్నమై ఉంది. ఏడు ప్రమాణాలతో కూడిన ఈ స్వీయ అంచనా నివేదికను త్వరలో విశ్వవిద్యాలయం నాక్ కు సమర్పిస్తారు. ఈ నివేదిక ఆధారంగా నాక్ కమిటీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి తమ అభిప్రాయాన్ని రిపోర్ట్ రూపంలో సూచించిన ప్రకారం యూనివర్సిటీ గ్రేడింగ్ ఇస్తారు.



## నాక్ అక్రిడిటేషన్ యొక్క ప్రయోజనాలు



విశ్వవిద్యాలయ స్థాయి మెరుగుపడటం,
ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల నిధులు,
మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు,
విశ్వవిద్యాలయ ప్రగతికి నిధులు,
కన్సల్టెన్సీ ప్రాజెక్ట్స్,
పరిశోధనలకు కావల్సిన నిధులు,
పరిశోధన, ప్రాజెక్టుల సహకారాలు
విద్యావిధానంలో ఆధునికత
బోధన – అభ్యాస నాణ్యత
ప్రతిభవంతులైన విద్యార్థుల ప్రవేశాలు,
విద్యార్థులకు కెరీర్ అవకాశాలు,
మెరుగైన అవగాహన ఒప్పందాలు NAAC గుర్తింపు విశ్వవిద్యాలయ సామర్థ్యాలు, నైపుణ్యాలు మరియు విజ్ఞానం యొక్క నాణ్యత గురించి నిర్ధారిస్తుంది. NAAC అక్రిడిటేషన్ సాధించడానికి స్వీయ అంచనా నివేదిక కీలక పాత్ర పోషిస్తుంది. స్వీయ అంచనా నివేదికలోని ఏడు అంశాలు, ఆ నివేదికను తయారు చేయడానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యుల వివరాలు.

### స్వీయ అంచనా నివేదికలోని ఏడు అంశాలు - నివేదిక తయారీ కమిటీ సభ్యులు

**ఆచార్య కె.శ్రీరమేష్,** సమన్వయకర్త

**డా.కె.వి.స్వామి,** కార్యనిర్వాహక సమన్వయకర్త

**ఆచార్య పి.సురేష్ వర్మ,** సలహాదారు

1. పాఠ్యాంశాల రూపకల్పన మరియు అభివృద్ధి
   డా.డి.జ్యోతిర్మయి,
   డా.బి.వి.వి.బాలకృష్ణ, డా.పి.రాజశేఖర్
2. బోధన అభ్యాసం మరియు మూల్యాంకనం
   డా.ఎం.కమలకుమారి,
   డా.కె.ఎస్.పీటర్, డా.ఎ.ఎస్.పద్మవల్లి
3. పరిశోధన ఆవిష్కరణ , విస్తరణ కార్యక్రమాలు
   డా.కె.రమణేశ్వరి,
   డా.ఎన్.వి.వి.ఎస్.నారాయణ, డా.ఐ.జె.ఎన్.పద్మవతి
4. మౌలిక సదుపాయాలు, అభ్యాస వనరులు
   డా.వి.పెర్సిస్,
   డా.కె.సతీష్ కుమార్, డా.అనితాకుమారి, డా.ఎ.విజయదుర్గ
5. విద్యార్థుల మద్దతు మరియు పురోగతి
   డా.బి.జగన్మోహనరెడ్డి,
   డా.ఎన్.సజనారాజ్, డా.ఎం.రమేష్, ఆర్.సాంబశివరావు
6. పాలన, నాయకత్వం మరియు నిర్వహణ
   డా.ఎ.మట్టారెడ్డి,
   డా.ఎం.గోపాలకృష్ణ, డా.ఎల్.సుజాత
7. సంస్థాగత విలువలు మరియు ఉత్తమ పద్ధతులు
   డా.పి.విజయనిర్మల,
   డా.జి.అప్పారావు, ఎ.ఎం.శిరీష

## నన్నయకు అతిత్వరలో నాక్ గుర్తింపు



విశ్వవిద్యాలయాల అభివృద్ధికి నాక్ గుర్తింపు ఎంతో అవసరం. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు నాక్ గుర్తింపును సాధించి ప్రగతి పథంలో పయనిస్తూ నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలని సూచించారు. దానిలో భాగంగా నాక్ గుర్తింపు సాధించేందుకు సమష్టిగా కృషి చేస్తున్నాం. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో లాక్ డౌన్ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నాక్ పనులు చేసేందుకు అధ్యాపకులకు మార్గనిర్దేశం చేసాం. ప్రస్తుతం నాక్ సాధనకు చేస్తున్న ప్రయత్నాలు ముగింపు దశకు చేరుకున్నాయి. సెల్ఫ్ స్టడీ రిపోర్ట్ అతిత్వరలోనే అప్ లోడ్ చేస్తాము. విశ్వవిద్యాలయానికి నాక్ లో మంచి గ్రేడ్ తీసుకువస్తాం. విశ్వవిద్యాలయ నాక్ సాధన లక్ష్యంగా పని చేస్తున్న సిబ్బందికి అభినందనలు.

**- ఆచార్య మొక్కా జగన్నాథరావు, ఉపకులపతి**

## సమష్టి సహకారంతో సాధిస్తాం



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపును తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. గత ఏడాది కాలంగా నాక్ పనులు వేగవంతం చేసాం. వీసీ ప్రోత్సాహంతో లాక్ డౌన్ లో కూడా అన్ని విభాగాల సిబ్బంది నాక్ సాధన దిశగా పనులలో నిమగ్నమైయ్యారు. అన్ని రకాలుగా విశ్వవిద్యాలయం ముందుకు వెలుతుంది. ముఖ్యంగా విద్య, పరిశోధనలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. స్వీయ అంచనా నివేదిక కమిటీ సభ్యులు నాక్ సాధనకు మరింత కృషి చేస్తున్నారు. అందరి సహకారంతో త్వరలో విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపును సాధిస్తాం.

**- ఆచార్య కొట్టి శ్రీరమేష్, సమన్వయకర్త**

## రిపోర్టు సిద్ధం చేస్తున్నాం..



2016 - 17 విద్యా సంవత్సరం నుండి 2020-21 విద్యాసంవత్సరాల కాలంలో స్వీయ అంచనా నివేదికలోని ఏడు అంశాలపై రిపోర్ట్ సిద్ధం చేస్తున్నాం. విశ్వవిద్యాలయ ప్రగతిని సూచించే విధంగా ఈ రిపోర్ట్ తయారు అవుతుంది. త్వరలో ఈ నివేదికను నాక్ బెంగళూర్ వారికి సమర్పిస్తాం. నివేదిక ఆధారంగా నాక్ వారు నియమించిన కమిటీ నివేదికను విశ్లేషించి, విశ్వవిద్యాలయాన్ని సందర్శించి మౌళిక వసతులను పరిశీలించిన తరువాత వారిచ్చే నివేదిక ప్రకారం నాక్ వారు విశ్వవిద్యాలయానికి గుర్తింపు మరియు గ్రేడ్ ను ప్రకటిస్తారు.

**-డా.కె.వి.స్వామి, కార్యనిర్వాహక సమన్వయకర్త**

# సంపాదకీయం



## మాట నేర్పు..

**మాటల చేత దేవతలు మన్నన జేసి వరంబు లిత్తు,రా**
**మాటల చేత భూపతులు మన్నన జేసి పురంబు లిత్తు,రా**
**మాటల చేత మానినులు మన్నన జేసి సుఖంబు లిత్తు,రా**
**మాటలు నేర్వకున్న నవమానము, న్యూనము ,మానభంగమున్**

***ఈ పద్యం అజ్ఞాత కవి కృతం !***

ఎంత చక్కని పద్యం. లోకంలో మెప్పుపొందాలంటే మాటనేర్పు చాలా అవసరం!

సుఖజీవనానికది సోపానం. మాటపొందిక లేని మానవుడు ఎక్కడా రాణించలేడు.


యుక్తియుక్తంగా , ప్రియవాక్కులతో హృదయాహ్లాద జనకంగా,వినసొంపుగా మాటలాడగలిగితే సర్వ సంపదలూ సర్వ శ్రేయాలూ వాటియంతకు అవేవచ్చి మనల్ని అలరిస్తాయి. అట్టివాడు లోకప్రియుడు .వానికి లోటుండదు.వానిమాటకు తిరుగుండదు. అలా మాట నేర్పు గల వారికి కలిగే లాభాలను కవి పైపద్యంలో పేర్కొన్నాడు.

దేవతలు మన మాటలను మెచ్చి వరాలిస్తారు. అవే దైవ నుతులు,స్తుతులు. మాటలను మెచ్చుకునే రాజులు అగ్రహారాదులు కానుకగా యిస్తారు. ఆ మాటలు మెచ్చే మగువలు మనసారా సుఖాన్ని పంచుతారు. అందుచేత మంచిగా, నేర్పుగా మాటలాడటం నేర్చుకో! మాటనేర్పు లేకపోతే లోకంలో మనుగడ కష్టమౌతుంది. అడుగడుగునా అవమానాలే యెదురౌతాయి. పందిమందిలో చులకనైపోతారు. స్వాభిమానం దెబ్బతింటుంది. కాబట్టి పొందికగా అందంగా నేర్పుగా మాటలాడటం నేర్చుకోమని తాత్పర్యం, కవి సందేశం!

కాళిదాసు మొదలైన కవులు సరస్వతీ కటాక్షంతో విశుద్ధవచో వైభవులై భోజాది రాజేంద్రులచే అనర్ఘ వైభవాలను పొంది సుఖింపగా, బీర్ బల్ మొన్నగువారు చతుర వచో వైభవంతో అక్బర్ వంటి వారిని మెప్పించుట మనకు విదితమే!
కాబట్టి హితంగా, మితంగా, ప్రియంగా మాటలాడుతూ లోకమంతా మనవెంట నుండేలా మనుగడను సాగిద్దాం.మానవత్వపు పరిమళాలను సాటివారికి పంచుదాం!

**అతిభాష అతిహాని - మితభాష అతిహాయి**

## మంచిమాట



కొందరు గొప్పవారిగా జన్మిస్తారు. అదృష్టవంతులు!

ఇంకొందరకు గొప్పదనం ఆపాదించబడుతుంది.
వీరూ అదృష్టవంతులే!

మరికొందరు గొప్పదనాన్ని సాధిస్తారు.
మనం చెప్పుకోవలసింది వీరిని గురించే!
చెప్పుకోవడానికి కావలసినన్ని అంశాలు కూడా వీరి జీవితాల్లోనే లభిస్తాయి.


**- డా.రావూరి భరద్వాజ, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత**

# ది సెవెన్ హాబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ పీపుల్




ప్రతి వ్యక్తి తన జీవితంలో ఎన్నో అలవాట్లు ఆలవరచుకుంటాడు. ఈ అలవాట్లు మన జీవన విధానాన్ని దాని ఉత్కృష్టతను తెలియపరుస్తాయి. ఈ పుస్తకం వ్యక్తిగత అభివృద్ధి, నైపుణ్యాలు, సమర్ధవంతమైన భావవ్యక్తీకరణ మరియు ఇతరులతో పరస్పర సంబంధాలు, చర్యలకు ఒక సూచన. స్టీఫన్ కోవే ఈ పుస్తక రచయిత, ఆయన ఉద్దేశం ప్రకారం ఏ వ్యక్తి కూడా వారి ప్రవర్తనను ఒక్కరోజులో మార్చుకుని అద్భుతాలను సృష్టించలేడు. పరివర్తన ప్రక్రియ అనేది క్రమంగా కాలక్రమేణా పట్టుదలతో సాధనతో సమూలమైన మరియు సానుకూల మార్పు చూడగలం. అంటే ఈ ప్రక్రియ, పట్టుదల, సాధన అనేవి మనలను మనం తీర్చిదిద్దుకునేందుకు పనిముట్లుగా ఉపయోగపడతాయి. అంతేకాకుండా ఈ పుస్తకం మనల్ని మనం ఎలా లోతుగా అన్వేషించు కోవాలో (స్వీయాన్వేషణ), మన తత్వాలని, మన నిర్దిష్ట పరిమితుల్ని మరియు మనకు ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో నేర్పుతుంది. ఈ పుస్తకం మన జీవితంలో ఎప్పటినుంచో మనలో దాగివున్న అత్యంత విలువైన విలువలను కూడా చూపుతుంది. చాలామంది ఈ పుస్తకం వ్యాపారరం గానికి చెందినది అని అనుకుంటుంటారు కానీ ఈ పుస్తకం నీతి, సమగ్రత, జ్ఞానం మరియు కనీసపరిజ్ఞానం సూత్రాలపై ఆధారపడిన జీవన విధానం యొక్క నైతికతను నిర్వచించింది.

ఈ పుస్తకం విజయ సూత్రాలను వివరిస్తుంది. ఇవి అన్నివేళలా అందరికీ వారి వారి జీవితాలలోని అన్ని రంగాలకు వర్తిస్తాయి. అయితే వాటిని ప్రతీరోజు అభ్యాసం చేయాలి.ఒక అలవాటుగా మార్చుకోవాలి. విజయం అనేది ఒక అలవాటుగా మార్చుకుంటే అది ఇతరులకు ప్రేరణనిస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ పోటీ ప్రపంచంలో, బాధ్యతలు, ఒత్తిడి మరియు కాలపరిమితులు మధ్య కొట్టిమిట్టాడుతున్న




మనకు ఈ పుస్తకం ఒక మార్గదర్శిలా సహకరిస్తుంది.

**- డా.నారాయణ నక్కిన**

# ఏ.యు.గౌరవ ఆచార్యులుగా మొక్కా జగన్నాథరావు

ఆంధ్ర విశ్వవిద్యాలయ గౌరవ ఆచార్యులుగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు బాధ్యతలను అప్పగిస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా ఆంధ్రవిశ్వవిద్యాలయంలో వీసీ ప్రసాదరెడ్డిని జగన్నాథరావు మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేసారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం జియాలజీ విభాగంలోని విద్య, పరిశోధన, ప్రాజెక్టులు వంటి అంశాలలో తమ సేవలు, విజ్ఞానం ఎంతో అవసరమని ప్రసాదరెడ్డి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయం జియాలజీ విభాగంలో తనకున్న అనుభవాన్ని భవితరాల విద్యార్థులకు అందించాలని ఉద్యోగ విరమణ కార్యక్రమంలో వీసీ ప్రసాదరెడ్డి అన్న మాట ప్రకారం గౌరవ ఆచార్యులుగా నియమించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విశ్రాంత ఉద్యోగుల సేవలను, విజ్ఞానాన్ని భావితరాలకు అందించాలని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇచ్చిన చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సేవలందిస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచిస్తున్న



వీసీ ప్రసాదరెడ్డిని కలిసిన మొక్కా జగన్నాథరావు

నాణ్యమైన ఉన్నత విద్యను అందించడంతో పాటు జియాలజీలో నూతన ఆవిష్కరణలకు పాటుపడతానని తెలియజేసారు. తనకేంతో ఇష్టమైన గురువృత్తిని కొనసాగించేందుకు గౌరవ ఆచార్యునిగా నియమించిన వీసీ ప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసారు.

# డొనేటెడ్ బుక్స్ వింగ్ ఏర్పాటు చేద్దాం..

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కేంద్ర గ్రంథాలయంలో శాశ్వతంగా దాతలు సమర్పించిన పుస్తక భాండాగారం ఏర్పాటు చేద్దామని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథ రావు అన్నారు. విశ్వవిద్యాల యంలో నన్నయవాణి పత్రిక కార్యాల యానికి విచ్చేసిన సందర్భంలో ఎడిటర్ డా.తలారి వాసు, మీడియా సెల్ కోఆర్డినేటర్ పి.ఆనంద్ తో డొనేటెడ్ వింగ్ ప్రస్తావన చేశారు. తెలుగుశాఖ సహాయాచార్య డా.తలారి వాసు సేకరించిన, దాతలు సమర్పించిన సుమారుగా పదివేల పుస్తకాలతో శాశ్వతంగా ఒక డొనేటెడ్ బుక్స్ వింగ్ ను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు,అధ్యాపకులకు, పరిశోధక విద్యార్థులకు విలువైన, అరుదైన పుస్తకాల్ని అందించినవారమవుతామని అన్నారు. కేంద్ర గ్రంథాలయంలో ప్రత్యేకంగా ఒక వింగ్ ను ఏర్పాటు చేసి దాతలు సమర్పించిన పుస్తకాలన్నిటినీ అక్కడ భద్రపరిచేందుకు కావలసిన ఏర్పాట్లు చేయాలని తలారి వాసుకి సూచన లిచ్చారు. న్యాక్ దృష్ట్యా నన్నయవాణి పత్రిక ఇన్నోవేటివ్ ప్రాక్టీస్ గా ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చుతుందని, డొనేటెడ్ బుక్స్ వింగ్ మరింత ప్రయోజనాన్ని సమకూర్చుతుందని అన్నారు. దాతలు ఎవరైనా తమ పేరు మీదుగా పుస్తకాలను విశ్వవిద్యాలయానికి సమర్పించవచ్చునని వాటి ద్వారా విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, దాతలు సమర్పించిన గ్రంథాలను కేంద్ర



నన్నయవాణి కార్యాలయ సమావేశంలో వీసీ

గ్రంథాలయంలో భద్రపరుస్తున్నామని విద్యార్థులకు నిరంతర ఉపయోగపడతా యని ఈ విషయంలో పుస్తకాలను సమర్పించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు సమర్పించిన పుస్తక దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో పి.ఆర్.ఓ.ఆనంద్, సైకాలజీ అధ్యాపకులు డా.పడాల రాజశేఖర్, డా.ఎన్.వి.ఎస్. నారాయణ పాల్గొన్నారు.




ప్రతిభా వాణి

# పాతూరి నాగభూషణం

(20.8.1907 -



పాతూరి నాగభూషణం గారు గుంటూరు జిల్లా పెదపాలెం గ్రామానికి చెందిన సామాన్య రైతు కుటుంబంలో ధరణమ్మ, బుర్రయ్య దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య కూచిపూడి, పెదపాలెం గ్రామాలలో ఉన్నత విద్య, నిడుబ్రోలులోని ఎడ్వర్డ్ హైస్కూలులో, కళాశాల విద్య మద్రాసులోని లయోలా కళాశాలలో తర్వాత మదనపల్లెలోని బెసెంట్ థియొసాఫికల్ కాలేజిలో చదువుకున్నారు. గ్రంథాలయ నిర్వహణ, వయోజన విద్యాబోధన విషయాలలో అధ్యయనం చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రంథాలయోద్యమాన్ని అయ్యంకి వెంకట రమణయ్య గారు ఆరంభించారు. దీనిని పాతూరి నాగభూషణం ముందుకు నడిపించి దాని వ్యాప్తికి దోహదం చేశారు. గ్రంథాలయోద్యమ వ్యాప్తికి, గ్రంథాలయ విద్య, శిక్షణ, అంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘానికి ఆయన ఐదు దశాబ్దాలుగా చేసిన సేవ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

ప్రాథమిక విద్య అభ్యసించే రోజుల్లోనే ఈయన తన గ్రామంలో బాలసరస్వతీ భండారము అనే గ్రంథాలయాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత గ్రంథాలయ భవనం నిర్మించి, వేలకొలది గ్రంథాలను సేకరించి చుట్టుపక్కల నలభై గ్రామాలకు అందుబాటులో ఉంచారు. పెదవడ్లపూడి, దుగ్గిరాల గ్రామాలలో శాఖాగ్రంథాల యాలను నెలకొల్పారు. గుంటూరు గ్రంథాలయ సంఘానికి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి దాదాపు 160 గ్రామాలలో గ్రంథాలయాలను నెలకొల్పడానికి, 28 గ్రంథాలయాలకు కొత్త భవనాలు నిర్మించడానికి కృషి చేశారు. కాలువ మీది ప్రయాణీకుల పడవలలో సంచార గ్రంథాలయాన్ని 1935-42 మధ్య ఏడు సంవత్సరాలు నడిపారు. ఆంధ్రదేశమంతటా గ్రంథాలయ నిర్మాణ, నిర్వహణలను ఒక మహోద్యమంగా నిర్వహించారు. పల్లెపల్లెలలో సంచరించి ప్రచారం చేసి, ప్రోత్సహించి గ్రంథాలయాలను నెలకొల్పడానికి కారకుడయ్యారు. ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ చట్టం రూపొందించడానికి ఏర్పడ్డ కమిటీలో ఈయన కూడా సభ్యులు. విజయవాడ నగరం మధ్య పటమటలో భూమిని సేకరించి ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘానికి స్వంత భవనం “సర్వోత్తమ భవనం” 1949 లో ఏర్పరిచారు. 1958 లో బాపూజీ మందిర్, 1960లో జోగిరాజు భవనం, 1983 లో రామినేని సదన్ నిర్మించారు. సర్వోత్తమ గ్రంథాలయం ఇక్కడే ఏర్పాటు చేశారు. గ్రంథాలయ మహాసభలను నిర్వహిం చారు. గ్రంథాలయ విద్యలో శిక్షణనిచ్చి వాటి నిర్వహణకు కావలసిన కార్య కర్తలను సమకూర్చారు. విజయవాడ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, దాని ముద్రణాలయం ఈయన చేతులమీదుగా నిర్మించబడ్డాయి. ఆంధ్ర గ్రంథాలయ సంఘానికి కార్యదర్శిగాను, ‘గ్రంథాలయ సర్వస్వము’ పత్రికకు సంపాదకునిగాను, ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్కు కౌన్సిల్ మెంబరుగాను పనిచేశారు.


జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పాతూరి నాగభూషణం గారి గ్రంథాలయోద్యమ, నిర్వహణ,స్థాపన సేవలకు నన్నయవాణి అక్షర నీరాజనాన్ని సమర్పిస్తోంది.

## వార్త యందు జగము వర్ధిల్లుచున్నది

- నన్నయ భట్టారకులు

‘నవంబర్ 16 ప్రెస్ డే’
పాత్రికేయ
మిత్రులకు...
శుభాకాంక్షలతో....

- నన్నయవాణి




# బాయ్స్ హాస్టల్ ను పరిశీలించిన రిజిస్ట్రార్ అశోక్

ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని బాయ్స్ హాస్టల్ ను రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ గురువారం పరిశీలించారు. బాయ్స్ హాస్టల్ లోని విద్యార్థుల గదులను, వంటగదిని, భోజనహాల్ ను పరిశీలించి, భోజన నాణ్యతపై సిబ్బందిని ఆరా తీసారు. భోజన నాణ్యతను పరిశీలించేందుకు రిజిస్ట్రార్ మెస్ లోనే భోజనం చేసి పలు సూచనలను అందజేసారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి నాణ్యమైన భోజనాన్ని వారికి అందించాలని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా భోజన, అల్పాహార సమయాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు హాస్టల్స్ లో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత విద్యపై దృష్టిసారించాలన్నారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఎప్పటికప్పుడు విద్యార్థులతో మమేకమవుతున్నారని గుర్తు చేసారు. వాతావరణ మార్పు కారణంగా విద్యార్థులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డెన్లు డా.బాలసత్యనారాయణ, డా.ముత్యాల నాయుడు, ఉదయ్ పాల్గొన్నారు.


హాస్టల్ భోజన నాణ్యతను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్

# సీడీసీకి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా జి.చంద్రకళ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ కు అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా జి.చంద్రకళకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉత్తర్వులందించారు. యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా జి.చంద్రకళ ఎస్టాబ్లిష్మెంట్ లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ కు అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా జి.చంద్రకళకు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో సుమారు నాలుగు వందలకు పైగా డిగ్రీ, పీజీ కళాశాలలు ఉన్నాయి. వాటి పర్యవేక్షణ,పరిశీలన, ప్రగతి వంటి అంశాలను యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ నిర్వహిస్తుంది. ఈ విభాగాన్ని మరింత పటిష్టపరచడంలో భాగంగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా జి.చంద్రకళకు అదనపు బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం సీడీసీ విభాగానికి అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా జి.చంద్రకళ, డీన్ గా డా.పి.వెంకటేశ్వరరావు, ఫ్యాకల్టీ అసోసియేట్ లుగా డా.పి.రాజశేఖర్,డా.వై. సుష్మప్రియ, డా.జి.కీర్తిమరిటా లు వ్యవహరిస్తున్నారు.



# ఇంజనీరింగ్ కారిడర్ లో మొక్కల ఏర్పాటు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ భవనంలోని తరగతి గదుల బయట ఉన్న కారిడర్ లో మొక్కల కుండీలను ఏర్పాటు చేసారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్. విభాగ సహకారంతో గురువారం కారిడర్ లో మొక్కలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని పచ్చని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రయత్నిస్తున్నారని దానిలో భాగంగా విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ కారిడర్ లో మొక్కల కుండీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంజనీరింగ్ కాలేజ్ లోని వారానికి ఒక విభాగం చొప్పున విద్యార్థులు ఒక్కొక్క మొక్కను తీసుకువచ్చి దానిని పర్యవేక్షించాలని సూచించామన్నారు. దీని ద్వారా విశ్వవిద్యాలయంలోని తరగతి గదుల ఆవరణాలు అందంగాను, ఆహ్లాదకరంగాను ఉంటాయని చెప్పారు. మొక్కలు పెంచే కార్యక్రమాన్ని విద్యార్థులు ఎంతో శ్రద్ధతో నిర్వహిస్తున్నారని తెలిపారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లోని సి.ఎస్.ఈ, ఐ.టి విద్యార్థులు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని చెప్పారు.



# నన్నయలో నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య - ఉద్యోగాలు



## అభివృద్ధి పథంలో ఇంజనీరింగ్ కాలేజ్

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**



యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు ఎ.ఐ.సి.టి.ఈ. గుర్తింపును తీసుకువచ్చాం. దీంతో ఇంజనీరింగ్ విద్యార్థులకు, అధ్యాపకులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. ఇంజనీరింగ్ విద్యను అభ్యసించేందుకు మంచి ర్యాంకులు వచ్చిన విద్యార్థులు క్యాంపస్ లో ఇంజనీరింగ్ చేయడానికి మొగ్గు చూపుతారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు అవసరమైన వసతులను, వనరులను అభివృద్ధి చేసాం. ఇంజనీరింగ్ వర్క్ షాప్ ల కోసం ప్రత్యేక భవనాన్ని నిర్మించి ఇటీవల రాష్ట్ర విద్యాశాఖామంత్రి డా.ఆదిమూలపు సురేష్ గారితో ప్రారంభించాం.అత్యాధునిక ల్యాబ్స్, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఇంజనీరింగ్ కళాశాలకు ఉండటం మరో విశేషం. ఇంజనీరింగ్ కళాశాలలో విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచడం మరియు విద్యార్థులల్లోని సృజనాత్మకశక్తిని వెలికితీసే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. గ్రామీణ నేపథ్యంలో వచ్చి క్యాంపస్ లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ఆయా ప్రముఖ కంపెనీలలో మంచి ఉద్యోగాలను సంపాదించడం హర్షణీయం. ఉద్యోగాలను సంపాదించి విద్యార్థులంతా ఉన్నత స్థానంలో నమ్మకంగా పని చేసి అనుభవాలను, విజ్ఞానాన్ని సంపాదించుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలి. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పేరుప్రతిష్టలను ఆయా ప్రాంతాలలో ప్రతిబింబించాలి. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులకు అభినందనలు.

## కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఇనిషియేట్ ఇన్స్పైర్ ఇన్నోవేట్

**డా.వి.పెర్సిస్, ప్రిన్సిపాల్, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్**



ఇంజనీరింగ్ కాలేజ్ స్థాపించిన నాటి నుండి ఎన్నో ఇనిషియేషన్స్ కు కేంద్ర స్థానంగా నిలిచింది. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహం మరియు చొరవతో ఎ.ఐ.సి.టి.ఇ. సాధించగలిగాం. అంత మాత్రమే కాకుండా వినూత్న కార్యక్రమాలు, డిపార్ట్మెంటల్ క్లబ్స్ మరియు వాల్ జర్నల్స్, విద్యార్థుల యొక్క క్రియాశీల సాంకేతిక ప్రతిభను కనపరచడానికి ఉపయోగకరంగా ఉన్నాయి.ముఖ్యంగా అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, ప్రోత్సాహం,స్పష్టంగా కనపడుతుంది. ప్రతీ విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను విలక్షణమైన ఆలోచనలను వెలికితీసి 21వ శతాబ్దానికి అవసరమైన ఇన్నోవేటీవ్ ప్రాజెక్టులకు తగిన గుర్తింపు అందివ్వడంలో కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎప్పుడు ముందుంటుంది. విద్యార్థులు కేవలం క్యాంపస్ ప్లెస్మెంట్ లకు మాత్రమే పరిమితం కాకుండా వారికి నచ్చిన మార్గాన్ని ఎంచుకొనే విధంగా తగిన మార్గ నిర్దేశకాలు వారికి అందిస్తున్నాం. ప్రతీ ఏటా సెప్టెంబర్ లో ఇంజనీర్స్ డే ను పురస్కరించుకొని జరిగే 'అద్విక టెక్ ఫెస్ట్' ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభకు ప్రతిరూపంగా నిలుస్తుంది. అంతేకాక ఎన్.ఎస్.ఎస్. ద్వారా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ సామాన్య మానవుల సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిష్కారాలను ప్రతిపాదించుటలో ఇంజనీరింగ్ విద్యార్థులు ముందుంటారు. ఈ విధంగా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు సొంతం చేసుకుంటూ నూతన ప్రణాళికలతో ముందుకు వెళుతుంది. ఇందుకై సూచనలు అందిస్తూ సహకారం అందిస్తున్న వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు గారికి, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ గారికి అసిస్టెంట్ ట్రైనింగ్ అండ్ ప్లెస్మెంట్ ఆఫీసర్ ఫర్ ఇంజనీరింగ్ కాలేజ్ ఎ.ఎం.శిరీష గారికి మరియు ఆయా విభాగాధ్యాపకులకు అభినందనలు.

## యూనివర్సిటీ గర్వకారణం

**-డా.బి.జగన్మోహనరెడ్డి యూనివర్సిటీ ప్లేస్మెంట్ ఆఫీసర్**



విద్యార్థిని విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకొని ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు సాధించడం నన్నయ యూనివర్సిటీకి గర్వకారణం. ఇటువంటి ప్లెస్మెంట్ లు పొంది విద్యార్థులకు జీవితాలలో స్థిరపడడానికి ప్రోత్సాహం అందిస్తున్న వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు కృతజ్ఞతలు. భవిష్యత్ లో యూనివర్సిటీలో మిగిలిన అన్ని విభాగాల విద్యార్థులకు యూనివర్సిటీ ప్లెస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తాం.



యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సి.ఎస్.ఈ.), ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్(ఈ.ఐ.ఈ.), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈ.సి.ఈ.), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐ.టి.) మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎం.సి.ఎ.) వంటి విభాగాలలో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసిన విద్యార్థులు ఆయా ప్రముఖ కంపెనీలలో ఉన్నత ఉద్యోగాలను సాధించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నుండి 2017-21 విద్యాసంవత్సరంలో విద్యాభ్యాసం పూర్తి చేసిన 82 మంది విద్యార్థులు ఉద్యోగాలను సంపాదించారు. మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చి విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కోర్సులను పూర్తి చేసి ఉద్యోగాలను సాధించిన యువతరానికి నన్నయవాణి శుభాకాంక్షలను తెలియజేస్తుంది.

### ఏడాదికి రూ.7.86 లక్షలు



మాది సంపర.నేను బీటెక్(ఐటీ)ఆదికవి నన్నయ యూనివర్సిటీలో చదువుకున్నాను. నాలుగో సంవత్సరం పూర్తి అయిన తర్వాత డి.బి.ఎస్ (డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ సింగపూర్) అనే సంస్థలో ఉద్యోగం సాధించాను. నాకు సంవత్సరానికి 7.86 లక్షల ప్యాకేజ్ వచ్చింది. దీనికి కారణమైన మా తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు నా ధన్యవాదములు.

**- అద్దంకి వినీల**

### నాకు ఉద్యోగం రావడానికి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ఉపయోగపడింది



మాది కాకినాడ. నేను ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిగ్రీతో బీటెక్ పూర్తి చేసాను. మా విశ్వ విద్యాలయంలలో స్టూడెంట్స్ కు అవసరమైన టెక్నికల్ లాబ్స్ మాకు అందుబాటులో ఉంచారు. ఆ లాబ్స్ మాకు అవసరమైనప్పుడు వినియోగించుకునే విధంగా చాలా సహాయపడ్డాయి. యూనివర్సిటీ క్యాంపస్ అవటం వలన లైబ్రరీ, గ్రౌండ్ అందుబాటులో ఉండేవి. లాక్ డౌన్ కారణంగా యూనివర్సిటీ మూసివేసినా ఒక విధంగా ఆన్లైన్ సర్టిఫికేషన్స్ చేయడానికి టైం దొరికింది. నాకు ఉద్యోగం రావడానికి ఆన్లైన్ ప్లేట్ఫామ్స్ చాలా సహాయపడ్డాయి.నేను టి.సి.ఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ కంపెనీస్ లో ఉద్యోగ ఆఫర్స్ వచ్చాయి.నేను ప్రస్తుతం టి.సి.ఎస్ లో రూ.7 లక్షల వార్షిక వేతనంతో సిస్టమ్స్ ఇంజనీర్ గా ఉద్యోగం చేస్తున్నాను.

**- షణ్ముఖి శిరీష**

### మెరుగైన బోధన అందించారు..



మాది రాజమండ్రి . డిగ్రీ పూర్తిచేశాక ఎంసీఏ కోర్సు చేసేందుకు బయటకు వెళ్లాల్సి వస్తుందేమో అనుకున్నా.ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోనే సీటు రావడంతో సంతోషంగా చేరిపోయా. ముందునుంచే మెరుగైన బోధన అందించడంతోపాటు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ప్రాంగణ ఎంపికలకు ప్రత్యేక విభాగం కూడా ఏర్పాటు చేసి బహుళజాతి సంస్థల్లో ఉద్యోగసాధనకు అవసరమైన నైపుణ్యతపై కూడా అవగాహన కల్పిస్తున్నారు.నా పట్టుదలతోపాటు అందరి సహకారంతో నాలుగు కంపెనీలలో ఎంపికయ్యాను. జోరీఎంటే , టెక్ మహీంద్రా, ఇన్నోమైండ్స్ మరియు సింటెల్ కంపెనీలలో ఉద్యోగాలు వచ్చాయి. ప్రస్తుతం జోరీఎంటే లో అసోసియేట్ సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా రూ.4.50 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం చేస్తున్నాను.

**- ఎస్. పద్మలత , రాజమండ్రి**

### మూడు కంపనీస్‌లో ప్లేస్ అయ్యాను



నేను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లో ఈ.సి. ఈ. లో మొదటి బ్యాచ్ గా చేరాను. మా కాలేజీ కొత్తది. కాబట్టి ఎటువంటి ప్లేస్మెంట్ లు రావనుకొని బాధపడ్డాను. కానీ మా ప్రిన్సిపల్ మేడం మరియు హెచ్.ఒ.డి సర్ ఇంకా మా ప్లేస్మెంట్ ఆఫీసర్ చాలా బాగా ఎంకరేజ్ చేశారు. వాళ్ళు వేరే వేరే కంపెనీస్ రిక్రూట్మెంట్ లింక్స్ పెట్టి మమ్మల్ని నిరంతరం సపోర్ట్ చేసేవారు. మా సీనియర్స్ నుండి పరీక్షా విధానాలు ఎలా వుంటాయో తెలుసుకున్నాను. అలా Accenture మరియు మూడు కంపనీస్‌లో ప్లేస్ అయ్యాను.

**- చంద్రశేఖర్**

### ఇన్ఫోసిస్ కంపెనీలలో ఉద్యోగం



నేను ఆదికవి నన్నయ యూనివర్సిటీ లో B.Tech(EIE) పూర్తి చేసాను.నా డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు మరియు అమ్మ ,నాన్న సహకారం తో కాగ్నిజెంట్, TCS, ఇన్ఫోసిస్ కంపెనీలలో ఉద్యోగాలు సాధించాగలిగాను.

**- నాగుబండి ప్రవల్లిక**

### క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగం సాధించా



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నేను క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగం సంపాదించడం చాలా ఆనందాన్ని కలుగచేసింది. బిటెక్ కోర్స్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ (E.I.E) విభాగంలో పూర్తి చేస్తుండగా ఆఖరి సంవత్సరంలో క్యాంపస్ కి సెలెక్ట్ కావడానికి యూనివర్సిటీ యాజమాన్యం మరియు తల్లితండ్రులు ప్రోత్సాహంతో సరైన రీతిలో అనుకున్నదాన్ని సాధించగలిగాను.

**- వి. మణికంఠ స్వామి**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in